## క్లుప్తంగా

### రేపటి నుంచి తాగునీటి సరఫరాకు అంతరాయం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ఆదివారం నుంచి తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి హెచ్ఎల్ఆర్(లక్ష్మీపురం) రిజర్వాయర్‌కు తాగునీటి సరఫరా జరిగే 900 ఎంఎం దయా పైపులైన్‌కు నెహ్రూ నగర్ పంప్ హౌస్, సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద ఇంటర్ కనెక్షన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. దీనికి ఆదివారం ఉదయం సరఫరా అనంతరం ఇంజినీరింగ్ అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారని ఆయన వెల్లడించారు. పైపులైన్ ఇంటర్ కనెక్షన్ పనుల కోసం తక్కెళ్లపాడు హెడ్ వాటర్‌వర్క్స్‌లోని ఫిల్టరేషన్ పాయింట్ నిలిపి వేయనున్నట్లు తెలిపారు. దీని వల్ల ఈనెల 31వ తేదీ నుంచి సాయంత్రం నుంచి సెప్టెంబర్ 2 ఉదయం వరకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. 2వ తేదీ సాయంత్రం నుంచి పాక్షికంగా, 3వ తేదీ ఉదయం నుంచి యథావిధిగా సరఫరా జరుగుతుందని తెలిపారు. పనుల వల్ల నగరంలోని హెచ్ఎల్ఆర్, స్తంభాల గరువు, గుజ్జనగుండ్ల, ఏటీ అగ్రహారం, ఏఎంసీ, హౌసింగ్ బోర్డ్ కాలనీ, కోర్ట్ కాంపౌండ్, కేవీపీ కాలనీ, వికాస్ నగర్, శ్యామల నగర్, హనుమయ్య నగర్, నెహ్రూ నగర్, రాజీవ్ గాంధీ నగర్, బొంగరాలబీడు, వసంతరాయపురం, శారదా కాలనీ, రెడ్డిపాలెం, గోరంట్ల, నగరాలు తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకి అంతరాయం ఏర్పడుతుందని ఆయన వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏఈలు వారీగా వాటర్ ట్యాంకర్లను సిద్ధం చేసుకోవాలని ఆయన ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

### తాగి విధుల్లో పాల్గొన్న ఉద్యోగిపై ఫిర్యాదు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ పరిపాలనా కార్యాలయ ఉద్యోగి ఒకరు మద్యం తాగి విధులకు హాజరవడంపై శుక్రవారం పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వి రమణకు ఫిర్యాదు చేశారు. అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న ఓ సీనియర్ ఉద్యోగి మద్యం తాగి విధులకు హాజరైనట్లు ఆరోపించారు. కార్యాలయ పనుల నిమిత్తం వచ్చిన వైద్యులు, వైద్య సిబ్బందిపై దుర్భాషలాడినట్లు ఫిర్యాదు చేశారు. గతంలోనూ సదరు ఉద్యోగి ఇదే తరహాలో మద్య తాగి విధులకు హాజరైనా అతనిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదని తెలిపారు. దీంతో తరచూ మద్యం తాగుతూ విధులకు హాజరవుతున్నట్లు పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

**వివరణ**

మద్యం తాగుతూ విధులకు హాజరవుతున్న వ్యక్తిపై ఫిర్యాదు అందించిన మాట వాస్తవమేనని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వి రమణ తెలిపారు. చట్టప్రకారం అతనిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని, ఎవరైనా విధులకు మద్యం తాగి వస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

### రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు స్పందన




నెహ్రూనగర్: దళిత విభజన వల్లే రాష్ట్రం రెండు ముక్కలైందని, ఇలాగే కొనసాగితే దేశం రెండు ముక్కలవుతుందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీని శుక్రవారం నగరంలోని హిందూ కాలేజీ కూడలి నుంచి బస్టాండ్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చింది ఆర్డర్ కాదని..అది కేవలం డైరెక్షన్ మాత్రమేనని తెలిపారు. దానిని అడ్డుపెట్టుకుని దళితులను విభజించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం వర్గీకరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

### సెల్‌ఫోన్ రేడియేషన్‌తో రొమ్ము క్యాన్సర్



గుంటూరు మెడికల్: సెల్‌ఫోన్ వాడకంతో వచ్చే రేడియేషన్ రొమ్ము క్యాన్సర్‌కు దారి తీస్తుందని జీజీహెచ్ సివిల్ సర్జన్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ బి.వి.రావు పేర్కొన్నారు. గుంటూరు జీజీహెచ్‌లో 28వ వారంలో భాగంగా 'మీ కోసం మేము' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో సెల్ ఫోన్ వాడకం, దుష్పరిణామాలు, స్త్రీ ఆరోగ్యం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణల గురించి డాక్టర్ బి.వి.రావు వివరించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వి రమణ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చేవారు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎవరైనా డబ్బులు అడిగితే సూపరింటెండెంట్, సీఎస్ఆర్వో కార్యాలయాల్లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

# వినాయకా... విఘ్నాలు కలుగనీయక !

**ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి**



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ నేతలు

పట్నంబజారు: ప్రణవ మంత్రమైన ఓంకార స్వరూపమే విఘ్న నాయకుడైన వినాయకుడని శాసనమండలి సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో ప్రజలు తలపెట్టిన మంచి పనులకు విఘ్నాలు తొలగిపోయి, అందరికీ సర్వ శుభాలు కలగాలని, సకల విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. అరండల్‌పేటలో గుంటూరు నగరపాలకసంస్థ కో–ఆప్షన్ మెంబర్ ఆలా సాంబశివరావు ఆధ్వర్యంలో నాయుడుపేటలో కారసాని యూత్, కొరిటిపాడు రెడ్ల బజారులో వాయుపుత్ర ఫ్రెండ్స్ సర్కిల్, రజక రామాలయం వద్ద స్నేహ యూత్ ఫ్రెండ్స్ సర్కిల్, అమరావతి రోడ్డులో ది రేసింగ్ బాయ్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక చవితి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు చెందిన సమస్త జగత్తును ఉదరంలో ఉంచుకున్న లంబోదర నామ స్మరణతోనే సమస్త పాప హరణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వంగల వలి వీరారెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ ఆలా సాంబశివరావు, కారసాని యూత్ ఉత్సవ నిర్వాహకులు కారసాని రమేష్, కారసాని సంజీవ్, రజియా బేగం, గంగాధరనాయుడు, సతీష్, రాము, వాయుపుత్ర ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు వంగల పున్నారెడ్డి, ఏటిగడ్డ వెంకట్ రెడ్డి, ఒంటెద్దు ఓబుల్ రెడ్డి, సుబ్బారెడ్డి, కత్తి సందీప్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, స్నేహ యూత్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు మునగాల సాయి, గంగాధర్, మణి గోపాల్, సాయి, ది రేసింగ్ బాయ్స్ ప్రతినిధులు సుబ్బు, మధు, అరవింద్, వసంత్, ఉదయ్, బద్రి, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, పార్టీ నేతలు షేక్ మస్తాన్‌వలి, బత్తుల దేవానంద్, ఓర్సు శ్రీనివాసరావు, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, పానుగంటి చైతన్య, షేక్ రబ్బానీ, బైరెడ్డి రవీంద్రారెడ్డి, రేజేటి నవీన్, సుబ్బరాజు పాల్గొన్నారు.

**గుంటి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో పూజలు**



గుంటి విఘ్నేశ్వరునికి పూజలు


పట్నంబజారు: వినాయక చవితి నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం పాత గుంటూరులో గల శ్రీ కుర్తాళం పీఠ పాలిత శ్రీ గుంటి విఘ్నేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి నిజ రూపంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు రావూరి సుబ్రమణ్యేశ్వరశాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక ద్రవ్యాలతో స్వామిని అభిషేకించారు. పంచామృతాలతో నివేదన అర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**విఘ్నాలన్నీ తొలగిపోవాలి**



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న నూరి ఫాతిమా

పట్నంబజారు: విఘ్నేశ్వరుడి దయతో ప్రతి ఒక్కరికీ విఘ్నాలు అన్నీ తొలగిపోయి మంచి జరగాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ఆకాంక్షించారు. నియోజకవర్గంలో పలుచోట్ల శుక్రవారం అన్నదానాలను ఆమె ప్రారంభించారు. 15, 13, 6, 44 డివిజన్లో జరిగిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆది దేవుడు విఘ్నేశ్వరుడి చల్లని దీవెనలు అందరికీ ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు వంగల హేమలత, వంగల వలి వీరారెడ్డి, ఇషాక్, శివనాగేశ్వరరావు, నందేటి రాజేష్, కిశోర్, పల్లా శీను, రాంప్రసాద్, చిలక రమేష్, ఆయా పందిర్ల నిర్వాహకులు పాల్గొన్నారు.



ఎస్‌వీఎన్ఆర్ రెడ్డి వసతి గృహంలో వినాయక విగ్రహంతో పాటు దివంగత నేత వైఎస్ చిత్రపటానికి పూల అలంకరణ చేసిన విద్యార్థులు

**ధన నాథుడు**



నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : నగరంలో వైఎస్సార్ సీపీ 21వ డివిజన్ కార్పొరేటర్ కాంద్రకుంట గురవయ్య ఆధ్వర్యంలో కేవీపీ కాలనీ 1/10వ లైనులో జరుగుతున్న 19వ గణపతి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రూ.44,44,444 కరెన్సీతో గణనాథుడిని ఘనంగా అలంకరించారు. ధన గణనాథుడిని చూసేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నగరంపాలెం: విద్యుత్ పనుల (11 కేవీ లైన్ షిఫ్టింగ్) దృష్ట్యా శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు గుజ్జనగుండ్ల, ఉద్యోగనగర్‌లో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ టౌన్– 2 (ఆపరేషన్) డీఈఈ గురవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కేవీపీ కాలనీ, ఎస్ఎస్ ఏరియాస్, శ్రీనివాసరావుతోట, ఎంజీనగర్, చుట్టుగుంట, కేవీపీ కాలనీ, కోట కాలనీలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని టౌన్– 3 డీఈఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### రేపు ప్రొఫెసర్ రతన్ లాల్ ఉపన్యాసం

గుంటూరు మెడికల్: బీపీ మండల్ సేన గుంటూరు ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం – సామాజిక న్యాయం' అనే అంశం పై ఈనెల 31న ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్, దళిత ఉద్యమ నేత డాక్టర్ రతన్‌లాల్ ఉపన్యాసం ఉంటుంది. ఈ మేరకు బీపీ మండల్ సేన ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న కార్యక్రమంలో నగర ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

### అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కార్యదర్శిగా జాన్సన్



నెహ్రూనగర్: అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కార్యదర్శిగా గోవతోటి సన్నీ జాన్సన్‌ను నియమిస్తూ సంఘ రాష్ట్ర అధ్యక్షులు బత్తుల వీరాస్వామి నియామక పత్రం అందజేశారు. పాత గుంటూరులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో జాన్సన్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

# దేశ భాషలందు తెలుగు లెస్స !

- ఘనంగా మాతృభాషా దినోత్సవం
- గిడుగు రామ్మూర్తికి ఘన నివాళి
- పలు పాఠశాలలలో విద్యార్థులకు పోటీలు



మాతృభాష ఘనత చాటుతూ కన్న విద్యాసంస్థల్లో విద్యార్థినుల ప్రదర్శన

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరు అమ్మభాషలోని మాధుర్యాన్ని తెలుసుకోవాలని వాణిజ్య పన్నుల శాఖ విశ్రాంత డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.చంద్రశేఖర్ పేర్కొన్నారు. పాత గుంటూరులోని కన్న విద్యాసంస్థల్లో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చంద్రశేఖర్ మాట్లాడుతూ అమ్మ భాష మాధుర్యాన్ని చవిచూస్తూ, ఇతర భాషలపై ఆసక్తి పెంచుకోవాలని కోరారు. కన్న విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ కన్న మాస్టారు మాట్లాడుతూ తెలుగు భాషను అన్ని స్థాయిల్లో ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. అనంతరం మాతృభాష ప్రాధాన్యతపై నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ఆసక్తిగా పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు. తెలుగు భాష కళామతల్లిని కీర్తిస్తూ విద్యార్థినులు ప్రదర్శించిన నృత్య రూపకం విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**జాతి అస్తిత్వానికి మాతృభాష కొలమానం**

వ్యవహారిక భాషోద్ధరణకు కృషి చేసిన గిడుగు రామ్మూర్తి ఆధునిక తెలుగు భాషా ఉద్యమ పితామహుడు అని ప్రముఖ రచయిత, రాష్ట్ర ప్రభుత్వ కళా రత్న అవార్డు గ్రహీత ఎం.ఎ స్.వి.ఎం ప్రసాద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో తెలుగు భాషా విభాగ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో ఘనంగా జరిపారు. తొలుత గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రసాద్ మాట్లాడుతూ మార్పును ఆపలేనప్పటికీ మాతృభాషను కాపాడేందుకు అన్ని రకాల అన్వేషణలు, కృషి జరగాలని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రమా జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ స్వయం ప్రతిపత్తి కలిగిన తమ కళాశాలలో తెలుగు భాష వికాసానికి ప్రత్యేక బోధన తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు కవిత రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగాధిపతి నల్లపనేని విజయలక్ష్మి, ఎస్. దివిజాదేవి, వాసిరెడ్డి భవాని, పరుచూరి విజయలక్ష్మి, ధాత్రికుమారి, చిలుక అనిత పాల్గొన్నారు

**తెలుగు భాషను ప్రోత్సహించాలి**

విద్యార్థి దశలో మాతృభాషను అభ్యసించే విధంగా తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు చొరవ చూపాలని విద్యా భారతి విద్వత్ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి బైరిశెట్టి మల్లికార్జునరావు పేర్కొన్నారు. నగరంపాలెంలోని ప్రజ్ఞ విద్యాసంస్థల్లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మల్లిఖార్జునరావు మాట్లాడుతూ మాతృభాషలో పరిజ్ఞానం ద్వారా మనో వికాసం కలిగి, ఇతర భాషలతో పాటు ప్రపంచ జ్ఞానాన్ని అందిపుచ్చుకుంటారని తెలిపారు. మేక్ మై బేబీ జీనియస్ సంస్థ వ్యవస్థాపకుడు భాస్కర్ రాజు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అంతరించిపోతున్న భాషల్లో తెలుగు ఒకటి ఉండటం బాధాకరమని తెలిపారు. తల్లిలా కాపాడుకునే బాధ్యత వర్తమాన సమాజంపై, విద్యాసంస్థలపై ఉందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ నాయుడు చక్ర నాగ్, హైకోర్టు న్యాయవాది చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు ఉపాధ్యాయులు,



ప్రజ్ఞ విద్యాసంస్థల్లో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళి

**సెయింట్ ఆన్స్ బాలికల జూనియర్ కళాశాలలో..**

అమరావతి రోడ్‌లోని సెయింట్ ఆన్స్ బాలికల జూనియర్ కళాశాల, ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం తెలుగు భాష దినోత్సవంతో పాటు జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ అమలా మేరీ జోస్ ఫిన్, ప్రిన్సిపాల్ సిస్టర్ విమలా మేరీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**సుమేధ స్కూల్లో ...**

ఎన్‌జీవో కాలనీలోని సుమేధ స్కూల్లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ కే రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కెనడీ నెక్ట్స్‌జన్ కిడ్స్‌లో ....**

అరండల్‌పేటలోని కెనడీ నెక్ట్స్‌జన్ కిడ్స్‌లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాఠశాల విద్యార్థులు తెలుగు తల్లి వేషధారణ, తెలుగు సాంప్రదాయ దుస్తులు చీర, పంచకట్టు దుస్తుల్లో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌లు, అధ్యాపకులు తెలుగు భాష ప్రాముఖ్యతను చిన్నారులకు వివరించారు. తెలుగు భాష అంతరించి పోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కెనడీ స్కూలులో సంప్రదాయ వేషధారణల్లో చిన్నారులతో ఉపాధ్యాయులు



స్టెమ్ పాఠశాలలో వేడుకలు

**అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ..**

లక్ష్మీపురం: వాడుక భాష వ్యాప్తికి జీవితాంతం అవిరళ కృషి చేసిన గిడుగు రామ్మూర్తి తెలుగు భాషాభిమానులందరికీ అత్యంత ప్రీతి పాత్రుడని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో రామ్మూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిడుగు తెలుగు వ్యవహారిక భాషోద్యమం తెలుగు భాషకు గొడుకు పట్టిందని తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీర్ ఎన్.సదాశివం, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

**నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత గిడుగు**

నగరంపాలెం: వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జాతికి స్ఫూర్తి ప్రదాత అని సాహితీవేత్త వి.నాగరాజ్యలక్ష్మి అన్నారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర్వస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం ఏపీ సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గిడుగు వేంకట రామ్మూర్తి పంతులు చిత్రపటానికి ఆలయ పాలకవర్గం, సంస్థ నిర్వాహకులు, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభకు సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ టి.రాధాబాయి అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రముఖ సాహితీవేత్త వి.నాగరాజ్యలక్ష్మి ప్రసంగిస్తూ సమాజ హితం కోసం వ్యక్తిగత జీవితాన్ని పణంగా పెట్టిన మానవ శాస్త్రవేత్త గిడుగు అని పేర్కొన్నారు. నిత్య జీవితంలో మాతృభాష తెలుగు ప్రాధాన్యాన్ని సంస్థ కోశాధికారి మైలవరపు లలితకుమారి వివరించారు.



అవగాహన సంస్థ కార్యాలయంలో...



మాట్లాడుతున్న నాగరాజ్యలక్ష్మి



సంప్రదాయ వస్త్రధారణలో సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థినులు



సుమేధా స్కూల్‌లో విద్యార్థులతో చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న రచయిత ప్రసాద్

**తెలుగు భాష మనందరికీ గర్వకారణం**

నగరంపాలెం: క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందిస్తాయని స్టెమ్ స్కూల్ ప్రిన్సిపల్ రెవరెండ్ ఎఫ్.ఆర్.భరత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విద్యానగర్‌లోని స్టెమ్ పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం, స్పోర్ట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష మనందరికీ గర్వకారణమని తెలిపారు. అనంతరం విద్యార్థులకు కవితా, పద్య పఠనం, ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## అడ్డం తిరిగిన లీజుదారులు



నిరసన వ్యక్తం చేస్తున్న పాత లీజుదారులు

నెహ్రూనగర్: ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌కు సంబంధించి 25 సంవత్సరాల లీజు గడువు పూర్తవ్వడంతో ఈ నెల 18, 19, 20వ తేదీల్లో 81 షాపులకు నగర పాలక సంస్థ అధికారులు బహిరంగ వేలం పాట నిర్వహించారు. అయితే, ఇందులో చాలా మంది బయటి వ్యక్తులు షాపులు దక్కించుకున్నారు. వేలం పాట ద్వారా కార్పొరేషన్‌కు 6.8కోట్లు ఆదాయం సమకూరింది. ఈ నెల 21న స్టాండింగ్ కమిటీ ఆమోదం తీసుకుని, 22న షాపులు కేటాయిస్తున్నట్లు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో పాత లీజుదారులను షాపులను ఖాళీ చేయించేందుకు రెవెన్యూ అధికారులు శుక్రవారం రాత్రి మార్కెట్‌కు వెళ్లి 20 షాపుల వరకు తాళాలు వేశారు. అయితే, మిగిలిన షాపులకు వేసే క్రమంలో వారంతా ఏకమై తాళాలు వేయవద్దని అధికారులతో వాగ్వివాదానికి దిగారు. బస్టాండ్ బయట కాసేపు రాస్తారోకో చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు అర్ధరాత్రి అయిన సరే పోలీసుల సహకారంతో షాపులను స్వాధీనం చేసుకునేందుకు రెవెన్యూ అధికారులు మార్కెట్‌లోనే తిష్ట వేశారు.

## నగరంలో తగ్గిన వాయు కాలుష్యం

నెహ్రూనగర్: నేషనల్ ఎయిర్ క్లీన్ ప్రోగ్రాం (ఎన్.క్యాప్)లో భాగంగా గుంటూరు నగరంలో చేపట్టిన పనుల వల్ల ఆయా ప్రాంతాల్లో వాయు కాలుష్యం మెరుగైందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో శుక్రవారం కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా పరిశ్రమల శాఖ, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్.క్యాప్ ద్వారా కేంద్ర ప్రభుత్వ నిధులతో గుంటూరు నగరంలోని జేకేసీ కాలేజీ రోడ్, కలెక్టరేట్, బ్రాడీపేట 4వ లైన్ తదితర ప్రాంతాల్లో నిర్మాణం చేసిన ఎండ్ టు ఎండ్ రోడ్ల వల్ల కాలుష్య శాతం తగ్గిందని తెలిపారు. రానున్న కాలంలో నగరంలో ప్రధాన రోడ్లన్నీ ఎన్.క్యాప్ కార్యక్రమంలో ఎండ్ టు ఎండ్ నిర్మాణం చేసేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ ఎస్ఈ సుందర్రామిరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ డీడీ మధుసూదనరెడ్డి, ప్రొఫెసర్ బాలప్రసాద్, కాలుష్య నియంత్రణ మండలి ఏఈఈ సుమంత్, కన్సల్టెంట్ కోమలి పాల్గొన్నారు.